## క్లుప్తంగా

### మంచి ప్రభుత్వాన్ని ప్రజలు వినియోగించుకోండి

కలెక్టర్ షణ్మోహన్ సగిలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమాడి, చిత్రంలో కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ సిటీ:** ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు గ్రామ, పట్టణ, నగర స్థాయిల్లో ప్రభుత్వం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. ఈ ప్రజా వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని 9, 10, 11, 12, 13 డివిజన్లలో శుక్రవారం సాయంత్రం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. పింఛన్లు రావడం లేదని, ఇంటి స్థలాలు లేవని, డబ్బులు చెల్లించినా తమకు ఇల్లు ఇవ్వలేదని మహిళలు తమ గోడును కలెక్టర్ ముందు వెళ్లబోసుకున్నారు. పర్లోవపేట ఏజీఎం స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని వంద రోజుల పాలనలోనే రుజువైందన్నారు. అనంతరం ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటింటా వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ నగర డిప్యూటీ కమిషనర్ మనోహర్, నగరపాలక సంస్థ కార్యదర్శి ఏసుబాబు, టీపీఆర్వో శైలజ తదితరులు పాల్గొన్నారు.

### పిచ్చి మొక్కలకు నిలయంగా విద్యుత్‌నగర్ పార్కు



పిచ్చి మొక్కలతో అధ్వానంగా ఉన్న విద్యుత్‌నగర్ పార్కు

**బోట్‌క్లబ్:** ప్రజల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌నగర్ పార్కు ప్రస్తుతం పిచ్చి మొక్కలకు నిలయంగా మారింది. సందర్శకులు పార్కులోనికి అడుగుపెట్టేందుకు కూడా వీలు లేకుండా ఉందంటే పరిస్థితి ఎలా ఉందో అవగతమవుతోంది. గత మూడు నెలల క్రితం పార్కును శుభ్రం చేయించిన అధికారులు తర్వాత దీని నిర్వహణనే మర్చిపోయారు. దీంతో ప్రస్తుతం పార్కు చాలా అధ్వానంగా తయారయ్యింది. పార్కులో ఉన్న చిన్న పిల్లల ఆట వస్తువులు కూడా తుప్పు పట్టిపోతున్నా సిబ్బంది ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పార్కు వినియోగంలోకి తెచ్చి, జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తే, ఈ ప్రాంతంలో ఉన్న వారికి ఎంతో సదుపాయంగా ఉంటుందని స్థానికులు కోరుతున్నారు.

### ఇంద్రపాలెం ఎస్సైగా వీరబాబు



**కాకినాడ రూరల్:** కాకినాడ రూరల్ సర్కిల్ పరిధిలోని ఇంద్రపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎం.వీరబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్సైగా పని చేసిన మణికుమార్ స్థానంలో ఈయన నియమితులయ్యారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇంద్రపాలెం స్టేషన్ పరిధిలో శాంతి, భద్రతల పరిరక్షణకు సిబ్బందితో కలిసి పనిచేస్తానన్నారు.

### పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం

**కాకినాడ సిటీ:** స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నగరపాలక సంస్థ పరిధిలో పలు చోట్ల మొక్కలు నాటే కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఏక్ పేడ్ మా కే నామ్ పేరుతో జరిగిన ఈ కార్యక్రమాల్లో వార్డు సచివాలయాల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఉద్యోగులు పిలుపునిచ్చారు. నగరంలోని అన్ని వార్డు సచివాలయాల్లోనూ ఈ కార్యక్రమాలు చేపట్టారు. కాకినాడ నగరాన్ని స్వచ్ఛంగా, సుందరంగా ఉంచేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయాలకు మొక్కలను పంపిణీ చేయగా, సుమారు రెండు వేలకు పైగా మొక్కలను నాటారు.

### ఘనంగా అక్కినేని జయంతి వేడుకలు

**బోట్‌క్లబ్:** సినీ హీరో, పద్మశ్రీ, పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు జయంతి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సంగీత లాడ్జి అధినేత రాజు ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. ఈ సందర్భంగా వెంకటరత్నపురంలోని బులుసు సాంబమూర్తి వికలాంగ పాఠశాల విద్యార్థులకు, అన్నదాన సమాజంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బోండా సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కోతల కూటమి

- ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ ఆర్భాటం
- అధికారంలోకి వచ్చి వంద రోజులైనా నేటికీ ఊసే లేని వైనం
- నమ్మి ఓట్లేసిన ప్రజల పరిస్థితి అగమ్యగోచరం
- పథకాల అమలుపై సన్నగిల్లుతున్న ఆశలు



రైతులకు ఇన్‌పుట్ సాయంగా కౌలు రైతులకు మెగా చెక్కును అందజేస్తున్న దృశ్యం (ఫైల్)

**కాకినాడ సిటీ:** ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ఆర్భాటం అంతా ఇంతా కాదు. ఓటేస్తే ఉజ్వల భవిష్యత్తు చూపుతా.. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకంటే రెండింతలు ఇస్తానంటూ చంద్రబాబు చేసిన హడావుడి ప్రజల కళ్లముందు ఇంకా కదలాడుతూనే ఉంది. కూటమి నేతలంతా బాబూ ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టి వంద రోజులైనా కూటమి ప్రభుత్వం నుంచి ప్రజలకు మొండి చేయే కనిపిస్తోంది.

#### హోరెత్తించిన కూటమి నేతలు

కాకినాడ రూరల్, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లోని జనసేన తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), కాకినాడ సిటీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన వనమాడి వెంకటేశ్వరరావు కూడా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేసి, ప్రజలను ఓట్లడిగి వేయించుకున్నారు. ఇటు చంద్రబాబు, అటు పవన్‌కల్యాణ్‌తో పాటు, నియోజకవర్గాల్లో కూటమి నాయకుల మాటలను విశ్వసించిన ప్రజలు వారికి పట్టం కట్టారు. అధికారం కోసం కూటమి నాయకులంతా, బడికి వెళ్లి చదువుకునే ప్రతి విద్యార్థికి తల్లికి వందనం కింద రూ.15 వేలు, నిరుద్యోగ భృతిగా యువతకు నెలకు రూ.3 వేలు, 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. తీరా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులవుతున్నా,, హామీల అమలుకు సంబంధించిన విధి విధానాలను నేటికీ ఖరారు చేయలేదు. ఒక్క హామీని అమలు చేయలేదు. మరోవైపు హామీల అమల్లో భయమేస్తోందంటూ కొత్త పల్లవిని అందుకున్నారు. ఈ తరుణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తారనే ఆశ ప్రజల్లో క్రమంగా సన్నగిల్లుతోంది.

**కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2019–24 మధ్య వివిధ పథకాల లబ్ధి ఇలా..**

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి (రూ. కోట్లలో) |
|---|---|---|
| అమ్మ ఒడి | 30,220 | 134.29 |
| విద్యా దీవెన | 20,549 | 72.77 |
| వసతి దీవెన | 16,000 | 27.53 |
| రైతు భరోసా | 22,716 | 106.96 |
| ఉచిత పంటల బీమా | 16,790 | 64.43 |
| సున్నా వడ్డీ పంట రుణాలు | 9,919 | 4.85 |
| రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ | 15,900 | 16.70 |
| మత్స్యకార భరోసా | 4,993 | 11.86 |
| పింఛను కానుక | 38,823 | 348.86 |
| వైఎస్సార్ చేయూత | 15,073 | 63.29 |
| వైఎస్సార్ ఆసరా | 48,501 | 156.73 |
| సున్నా వడ్డీ పథకం (డ్వాక్రా) | 59,666 | 13.89 |
| కాపు నేస్తం | 8,331 | 45.05 |
| ఈబీసీ నేస్తం | 1,334 | 5.92 |
| కల్యాణమస్తు, షాదీ తోఫా | 70 | 3.24 |
| వైఎస్సార్ ఆరోగ్యశ్రీ | 12,584 | 52.92 |
| హౌసింగ్ లబ్ధిదారులకు నేరుగా చెల్లింపులు | 8,241 | 10.31 |
| ఆరోగ్య ఆసరా | 6,052 | 48.52 |
| వైఎస్సార్ బీమా | 659 | 9.65 |
| వాహన మిత్ర | 3,040 | 8.78 |
| నేతన్న నేస్తం | 99 | 0.91 |
| జగనన్న చేదోడు | 1,921 | 4.21 |
| తెల్లకార్డుదారులకు కోవిడ్‌సాయం | 70,493 | 8.17 |
| జగనన్న తోడు (వడ్డీలేని రుణాలు) | 4.599 | 22.64 |
| మొత్తం | 4,12,775 | 1200.87 |

**నాన్ డీబీటీ లబ్ధి కింద..**

| పథకం | లబ్ధిదారులు | లబ్ధి (రూ. కోట్లలో) |
|---|---|---|
| ఇంటి స్థలాలు (భూసేకరణ అభివృద్ధికి పరిహారం) | 28,423 | 1542.25 |
| విద్యాకానుక | 14,215 | 12.57 |
| ట్యాబ్‌ల పంపిణీ | 2,727 | 7.01 |
| జగనన్న తోడు రుణాలు | 8,240 | 14.52 |
| జగనన్న గోరుముద్ద | 14,778 | 15.00 |
| ఇంటింటికి రేషన్ (79.8 లక్షల మిలియన్ టన్నులు) | 7,620 | 16.21 |
| మొత్తం | 1,66,790 | 1,798.47 |
| డీబీటీ, నాన్ డీబీటీ మొత్తం | 5,79,565 | 2,999.47 |

#### మాటపై నిలిచిన జగన్

ప్రజా సంకల్ప యాత్ర పేరిట పాదయాత్ర చేపట్టిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలతో మమేకమయ్యారు. వారి సమస్యలను దగ్గర్నుంచి చూసిన ఆయన.. వాటి పరిష్కారమే లక్ష్యంగా 2019 ఎన్నికలకు ముందు నవరత్నాల పేరిట మేనిఫెస్టోకు రూపకల్పన చేశారు. ఆ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి సీఎంగా బాధ్యతలు చేపట్టాక వీటిని సమగ్రంగా అమలు చేసి ప్రజల మోముల్లో చిరునవ్వును నింపారు. అమ్మ ఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, విద్యాదీవెన పథకాలను సమర్థంగా అమలు చేసి, ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు. అయితే తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు తన పాత పంథానే అవలంబిస్తూ, ప్రజలకు మరోసారి చుక్కలు చూపిస్తున్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపొంది, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయి ఉంటే.. తమకు ఈ కష్టాలు ఉండేవి కావనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

#### రైతులకు అండగా నిలవాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా నిధులు బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో జమయ్యేవి. నూతనంగా ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైనా అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయలేదు. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నిధులను అందజేసేలా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– వి.సీతారామరాఘవ, రైతు, విజయరాయుడుపాలెం

#### హామీని నిలబెట్టుకోవాలి



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. దీన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సిలిండర్లు ఉచితంగా వస్తాయని మేమెంతో ఆశగా ఎదురుచూస్తున్నాం.

– కర్రి మహాలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, తూరంగి

#### ఏదీ అమలు చేయలేదు



ఎన్నికల్లో మహిళలు, యువత, వృద్ధులు ఇలా ఓట్ల కోసం చంద్రబాబు పలు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక వీటిని అమలు చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అధికారంలోకి వచ్చి వంద రోజులైంది. ఏ ఒక్క పథకం అమలుకు నోచుకోలేదు.

– పంపన రామకృష్ణ, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకుడు

#### నిరుద్యోగ భృతి ఏదీ?



ఇంటికో ఉద్యోగం,, అలా కాని పక్షంలో నిరుద్యోగ భృతిగా రూ.3 వేలను ఇస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన విధి విధానాలను నేటికీ ఖరారు చేయలేదు. గతంలో మాదిరిగా ఈసారి కొర్రీలు పెడతారేమోనన్న భయంతో నిరుద్యోగ యువకులు ఉన్నారు.

– పులగల శ్రీనుబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు

## క్రీడాకారుడి తొలి అడుగు ఎస్‌జీఎఫ్‌ఐతోనే..



చెస్‌లో పోటీ పడుతున్న క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అర్బన్ ఎంఈఓ-2 రవికుమార్

- డీఎస్‌డీఓ శ్రీనివాస్ కుమార్
- ఉత్సాహంగా కాకినాడ అర్బన్ ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికలు

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలతోనే క్రీడాకారుడి తొలి అడుగు ప్రారంభమవుతుందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా క్రీడా మైదానంలో కాకినాడ అర్బన్ పాఠశాల క్రీడా సమాఖ్య పోటీల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. కాకినాడ అర్బన్ విద్యా శాఖ అధికారి-2 సీహెచ్ రవికుమార్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఎస్‌జీఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జార్జి మాట్లాడుతూ, గ్రామీణ స్థాయి నుంచి రూట్‌లెవెల్‌లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ఎస్‌జీఎఫ్‌ఐ 9 క్రీడాంశాల్లో మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. సీహెచ్ రవికుమార్ మాట్లాడుతూ, ఈ ఎంపికలకు ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా, ప్రైవేట్ పాఠశాలల నుంచి విద్యార్థులు రావడం అభినందనీయమన్నారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల సేవలు కొనియాడారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను శ్రీనివాస్ కుమార్, రవికుమార్ పరిచయం చేసుకుని ఎంపికలు ప్రారంభించారు. అండర్-14, 17లో చెస్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీలో నిర్వహించిన ఎంపికలకు కాకినాడ నియోజకవర్గం నుంచి 500 మంది పాల్గొన్నారు. ఎంఎస్‌డీఓ కె.పట్టాభి మాట్లాడుతూ, శనివారం యోగా, బ్యాడ్మింటన్, టీటీ, అథ్లెటిక్స్‌లో అండర్-14, 17లో ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికల నిర్వహణలో పీఈటీలు శ్రీనివాస్ కుమార్, ప్రసాద్, మేరి, కుమారి, పాషా పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ కరపత్రం ఆవిష్కరణ



పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వీసీ, నాయకులు

**కాకినాడ సిటీ:** ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) విద్యార్థి ఉద్యమ పోరుబాటలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో అక్టోబర్ 24న ఉస్మానియా యూనివర్సిటీలో స్వర్ణోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం జేఎన్‌టీయూకే వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ స్వర్ణోత్సవ సభను రెండు తెలుగు రాష్ట్రాల కమిటీలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్టు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు మహర్షి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

### 25న కార్గో వస్తువుల వేలంపాట

**కాకినాడ సిటీ:** ఏపీఎస్ ఆర్టీసీ కార్గో సెక్షన్‌లో ఎవరూ క్లెయిమ్ చేయని, ఎవరూ గుర్తించని పార్శిళ్లను ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటలకు కాకినాడ బస్టాండ్‌లో వేలం పాట వేస్తున్నట్టు డిపో మేనేజర్ మనోహర్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొని, కావల్సిన వస్తువులను పొందవచ్చన్నారు.

### నేడు కాకినాడ బీచ్‌ను సందర్శించనున్న మంత్రి

**కాకినాడ రూరల్:** కాకినాడ రూరల్ మండలంలోని సూర్యారావుపేట బీచ్‌ను రాష్ట్ర పర్యాటక, కల్చరల్ అండ్ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ శనివారం సందర్శించనున్నారు. రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం కాకినాడ చేరుకుని, 2.30 గంటలకు బీచ్ ఫ్రంట్‌లో పర్యాటకంగా అభివృద్ధిపై పరిశీలన చేయనున్నారు. అనంతరం బీచ్‌ను సందర్శించనున్నారు.

### 23 నుంచి సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

**కాకినాడ క్రైం:** కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు సర్వైకల్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ లావణ్యకుమరి శుక్రవారం తెలిపారు. ఎస్ఆర్ఎంటీ బ్లాక్‌లోని గైనకాలజీ ఓపీడీలో స్క్రీనింగ్ పరీక్షలు హెచ్ఓడీ డాక్టర్ వాసవ్ ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. పూర్తి ఉచితంగా నిర్వహించే ఈ పరీక్షలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### పందుల స్వైర విహారం

**కాకినాడ రూరల్:** మండల పరిధిలోని పలు గ్రామాలలో పందులు స్వైర విహారం చేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వైరల్ ఫీవర్లు ఎక్కువగా ఉండడంతో పందుల వలన మెదడు వాపు, ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వాటిని గ్రామాలలో సంచరించకుండా నిర్మూలించాలని కోరుతున్నారు. వాకలపూడి, వలసపాకల, రమణయ్యపేటలో పందులు సంచారం ఎక్కువగా ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు.

### క్రీడలతోనే మానసిక ఉల్లాసం

**సామర్లకోట:** నిత్య జీవితంలో క్రీడలతోనే మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అన్నారు. స్కూల్ గేమ్స్‌లో భాగంగా శుక్రవారం మండల పరిధిలో విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన క్రీడలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ చూపాలన్నారు. మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే చదివిన విషయాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని చెప్పారు. ఆటలలో గెలుపు, ఓటములు సహజమని, ఓటమిని స్ఫూర్తిగా తీసుకుని గెలుపుపై దృష్టి సారించాలన్నారు. ఆటలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్లు ఉన్నవారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు దక్కుతాయని తెలిపారు. దీనిని యువత దృష్టిలో ఉంచుకోవాలన్నారు. శుక్రవారం బాలురకు, శనివారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓలు వై శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు. విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పెద్దాపురం, సామర్లకోట మండల స్థాయుల్లో విజేతలకు ఈ నెల 23న సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలోనే నియోజకవర్గ స్థాయి పోటీలు ఉంటాయని వివరించారు.

## కేసీబీఎస్ ప్రగతి కోసం శ్రమిద్దాం

ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోసూరు



సమావేశంలో మాట్లాడుతున్న సొసైటీ అధ్యక్షుడు కోసూరు

**బోట్‌క్లబ్:** వందేళ్ల చరిత్ర కలిగిన కేసీబీసీను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంస్థ సభ్యులు, ఉద్యోగులు మరెంత కష్టించి పని చేయాలని ది కాకినాడ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు కోసూరు శ్రీనివాస సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సినిమా రోడ్‌లోని కేవీకే రావు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం కేసీబీఎస్ సర్వసభ్య సమావేశం జరిగింది. సభను అధ్యక్షుడు కోసూరితో పాటు, ఇతర పాలకవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు కోసూరి మాట్లాడుతూ, పాలకవర్గ సభ్యుల సమన్వయం, ఖాతాదారుల ఆదరణ, ఉద్యోగుల సమష్టి కృషితో కేసీబీఎస్ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ మరింత శ్రమించాలని కోరారు. సంస్థ ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయడం వల్లే సంస్థ అభివృద్ధి సాధించిందన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. ఆడిటర్ డీపీఆర్ స్వామి ఇన్‌కం టాక్స్‌తో పాటు, ఇతర సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చీమలకొండ గంగాధరం, సొసైటీ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, సభ్యులు కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ పాల్గొన్నారు.

## సమస్యలపై గ్రామస్తుల నిలదీత



పింఛను మంజూరు చేయాలని ఎమ్మెల్యే నానాజీని అడుగుతున్న మహిళ, సమస్యలు చెబుతున్న గ్రామస్తులు

- నేమాంలో కూటమి నేతలకు చుక్కెదురు
- ప్రొటోకాల్‌పై సర్పంచ్ అభ్యంతరం

**కాకినాడ రూరల్:** కూటమి ప్రభుత్వ పాలనకు వంద రోజులు పూర్తికావడంతో, ఇది మంచి ప్రభుత్వం పేరిట ప్రజల్లోకి వెళ్తున్న పార్టీ నేతలకు తొలిరోజే సమస్యలు స్వాగతం పలికాయి. కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని నేమాం గ్రామం నుంచి సెంటిమెంట్‌గా కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్తిబాబు దంపతులు, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు తదితర నాయకులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రొటోకాల్ ప్రకారం గ్రామ సర్పంచ్‌ను ముందుగా పిలవాల్సింది పోయి.. చివరిలో ఆహ్వానించడంతో వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచ్ రామదేవు చిన్న అధికారులను నిలదీశారు. సర్పంచ్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఎంపీడీవో స్వప్న, కూటమి నాయకులను ప్రశ్నించారు. రేషన్‌కార్డులు ఇవ్వాలని, పింఛన్లు ఇవ్వాలని ప్రజలు కోరారు. ఓ మహిళ మాట్లాడుతూ, తన ఇంటి స్థలాన్ని వేరొకరు వచ్చి ఆ స్థలం వారిదంటూ గొడవకు దిగుతున్నారని, న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నానాజీ.. పంచాయతీ కార్యదర్శి కేశవరావును పిలిచి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందిస్తామని, అర్హులైన వారికి పింఛన్లు ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## వాహనాలు నడిపించాలని క్లాప్ డ్రైవర్ల వినతి



డాక్టర్ పృథ్వీచరణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్లాప్ వాహన డ్రైవర్ల సంఘ నాయకులు

**కాకినాడ సిటీ:** నగరపాలక సంస్థ పరిధిలోని క్లాప్ వాహనాలను నడిపించాలని, డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో క్లాప్ వాహన డ్రైవర్లు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకుడు, క్లాప్ వాహన డ్రైవర్ల యూనియన్ గౌరవాధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ, క్లాప్ వాహనాలు నిలిచిపోవడంతో ఉద్యోగ భద్రతపై డ్రైవర్లు ఆందోళనగా ఉన్నారన్నారు. దీనిపై హెల్త్ అధికారి పృథ్వీచరన్‌కు వినతిపత్రం అందజేశామని, క్లాప్ డ్రైవర్లు ఆందోళన చెందవలసిన అవసరం లేదని చెప్పారు. నాలుగు రోజుల్లో చెత్త సేకరణ వాహనాలన్నీ వినియోగిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు మలక వెంకటరమణ, క్లాప్ వాహన డ్రైవర్స్ యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, ఇస్మాయిల్, భద్ర, కొండబాబు, గంగాధర్, శ్రీనివాస్, పూర్ణ, దుర్గాప్రసాద్, కొండబాబు, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న బాపిరాజు

**కాకినాడ రూరల్:** పరోపకార గుణంతో చేసే పనుల వలన కలిగే ఆనందం ఎనలేనిదని, ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష అన్నారు. విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు సహకారంతో స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరుల కోసం ఏ పని చేసినా అది కొత్త శక్తిని నింపుతుందన్నారు. ఎవరైతే పరుల కోసం జీవిస్తారో.. వారే ప్రజల మనసులో చిరస్థాయిగా నిలుస్తారని తెలిపారు. ఆ దిశగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాపిరాజు సేవా నిరతి అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, ప్రసాద్ నాయుడు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.